సాక్షి
సిద్దిపేట

శుక్రవారం । 15 । మార్చి । 2024




● **పరీక్షలు ముగిశాయోచ్..**

ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. గురువారం చివరి పరీక్ష రాసిన అనంతరం కేంద్రాల నుంచి విద్యార్థులంతా సంతోషంగా బయటకు రావడం కనిపించింది. పలువురు విద్యార్థులు ఆనందంతో బైబై చెప్పుకున్నారు. మరికొందరు సెల్ఫీలు దిగారు. హాస్టళ్లలో ఉండి చదువుకున్న విద్యార్థులు సాయంత్రం ఇళ్లకు బయలుదేరారు. మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ ఇంటిబాట పట్టారు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట







హుండీ లెక్కిస్తున్న శివరామకృష్ణ సేవ సమితి సభ్యులు



మల్లన్న హుండీ ఆదాయం
రూ.కోటి 4లక్షలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. 27రోజులలో స్వామివారి హుండీ ఆదాయం రూ.1,04,86,906 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఆలయ ముఖ మండపంలో హుండీలను లెక్కించారు. సిద్దిపేట వెంకటేశ్వర స్వామి ఆలయ ఈవో విశ్వనాథశర్మ, కార్యనిర్వహణాధికారి బాలాజీ సమక్షంలో లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా లభించిన నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఈఓలు, ఆలయ సిబ్బంది, శివశక్తి సేవ సమితిసభ్యులు పాల్గొన్నారు.

- కొమురవెల్లి(సిద్దిపేట)

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంటిపూట బడులు

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వేసవికాలం దృష్ట్యా శుక్రవారం నుంచి ఏప్రిల్ 23 వరకు జిల్లాలో ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు బోధన తరగతులు నిర్వహిస్తారన్నారు. అలాగే పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బోధన జరగనుందన్నారు.

నాచారం ధర్మకర్తల మండలి కోసం నోటిఫికేషన్

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ మండలం నాచారం గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటు కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. నోటిఫికేషన్ నేపథ్యంలో నూతన ధర్మకర్తల నియమాకానికి 20 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం చరిత్రాత్మకం

హుస్నాబాద్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి రెడ్డి సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం రెడ్డి సంఘం నాయకులు సన్మానించారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ఎనమిదేళ్లుగా పోరాటం చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో పట్టణ రెడ్డి సంఘం అధ్యక్షుడు మర్యాల కమలాకర్‌రెడ్డి, కార్యదర్శి ముప్పిడి రాజిరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అయిలేని శంకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): భువనగిరి ఎంపీ స్థానం నుంచి సీపీఎం బరిలో ఉంటుందని, ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దామని పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణ కేంద్రంలోని కార్యాలయంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాల నాయకుల సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. ప్రజల మధ్య ఐక్యతకు విఘాతం కలుగుతోందన్నారు. ఇలాంటి మతోన్మాద శక్తులను ఎంపీ ఎన్నికల్లో ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు సత్తిరెడ్డి, వెంకట్‌మావో, యాదగిరి, కృష్ణారెడ్డి, అరుణ్, శారద, నాగరాజు, రవీందర్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు పెంచాలి

సిద్దిపేటఅర్బన్: పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 కనీస వేతనాల చట్టం ఆధారంగా జనవరి 29న రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మార్చి 31లోపు అభ్యంతరాలు, సూచనలు తెలపాలని జీవోలను కార్మిక సంఘాలకు పంపిందని తెలిపారు. ఆ జీవోలను పరిశీలిస్తే అందులో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించలేదన్నారు. కనీస వేతనాలు పెంచని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, ఉపాధ్యక్షులు స్వామి, పద్మ, కోశాధికారి భాస్కర్, సహాయ కార్యదర్శి రవికుమార్, చంద్రారెడ్డి, శోభ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లకు మోక్షం

మూడేళ్లుగా ఎదురుచూస్తున్న పేద ప్రజలకు ఇది శుభవార్తే.. కొత్త రేషన్ కార్డులను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డుల జారీ కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణను ఆగస్టు 2021 నుంచి నిలిపివేశారు. అలాగే మార్పులకు, చేర్పులకు అవకాశం లేకపోవడంతో ఈ మధ్యకాలంలో పుట్టిన పిల్లలు, కొత్తగా వచ్చిన కోడళ్లు నమోదు కాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. దీనిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



- కొత్త రేషన్ కార్డుల జారీకి సర్కార్ గ్రీన్ సిగ్నల్
- పేద ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు
- కొత్తగా 40వేల మంది దరఖాస్తు
- మార్పు, చేర్పుల కోసం వెల్లువలా అప్లికేషన్లు

సాక్షి, సిద్దిపేట: కొత్త రేషన్ కార్డులు, మార్పు, చేర్పుల కోసం కొంత కాలంగా దరఖాస్తు దారులు ఎదురు చూస్తున్నారు. ఏ సంక్షేమ పథకానికైనా లబ్ధిదారునిగా ఎంపిక కావాలంటే రేషన్ కార్డు తప్పనిసరి. రేషన్ కార్డులు లేకపోవడంతో పలు సంక్షేమ పథకాలకు అర్హులు దూరమయ్యారు. ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందలేదు. ఇటీవల జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో అనేక మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇల్లు కోసం రేషన్ కార్డులు లేకపోవడంతో జాబితాలో చోటు దక్కలేదు. ప్రభుత్వ నిర్ణయంతో దరఖాస్తు దారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రజాపాలన కార్యక్రమంలో..

ప్రజాపాలన కార్యక్రమంలో తెల్ల కాగితంపై రేషన్ కార్డుల కోసం దరఖాస్తు రాసి ఇచ్చారు. ఇటీవల ప్రజాపాలనలో ఎక్కువగా రేషన్ కార్డుల కోసం సుమారుగా 40వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పెళ్లికాగానే కొందరు యువతులు స్వచ్ఛందంగా పేర్ల తొలగింపు కోసం దరఖాస్తు చేసుకున్నారు. పేర్లు తొలగించినంత ఈజీగా అత్తారింటి కార్డులో పేర్లు చేర్చలేదు. కొత్త కోడళ్ల పేర్ల నమోదుకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి ఏళ్ల గడుస్తున్నా మోక్షం కలగలేదు. జిల్లాలో కార్డులో చేర్పుల కోసం 41,751 మంది దరఖాస్తు చేశారు.

2.91 లక్షల కార్డులు

జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డులు 2,91,587 ఉండగా 8,95,569 యూనిట్‌లు ఉన్నాయి. అందులో ఆహార భద్రత 2,73,113, అంత్యోదయ కార్డులు 18,390, అన్నపూర్ణ కార్డుల్లు 84 ఉన్నాయి. ఎప్పటి నుంచి జారీ చేస్తారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనూజను అడగగా ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, రాగానే ప్రక్రియను ప్రారంభించి అర్హులందరికీ రేషన్ కార్డులను జారీ చేస్తామన్నారు.

ప్రభుత్వం నిర్ణయంతో త్వరలో మోక్షం కలగనుంది. ప్రభుత్వ నిర్ణయంతో దరఖాస్తు దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గౌరవెల్లిని పూర్తి చేస్తాం..
సాగు నీరందిస్తాం

- తాగునీరు సమస్య రానివ్వం
- గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



అక్కన్నపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలో పూర్తి చేసి సాగు నీరు అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.66లక్షలతో 14పనులు, రూ.35.50లక్షలతో 17పనులకు సంబంధించిన శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కుడి, ఎడమ కాలువల భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. గ్రామాల్లో తాగునీరు సమస్య రాకుండా ముందస్తుగా చర్యలను తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గానికి దాదాపు రూ.3.40కోట్ల నిధులను కేటాయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామన్నారు. అక్కన్నపేట మండలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత నాదేనన్నారు. అలాగే మండలంలో గిరిజన తండాలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రతి గిరిజన తండాలకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సమీకృత భవనాలు నిర్మాణానికి నిధులు సైతం త్వరలో మంజూరు చేస్తామన్నారు.

విద్య, వైద్య వసతుల కల్పన

హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని 250 పడకలుగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రతి పాఠశాలల్లో అన్నీ సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంమూర్తి, ఎంపీపీ మాలోతు లక్ష్మి జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతిని రాజకీయాలతో ముడిపెట్టడమా?

వర్షాలు కురవకపోతే కాంగ్రెస్ కరువు తెచ్చిందని ప్రతిపక్షాలు అనడం విడ్డూరంగా ఉందని, దీంతో వారి మేధావి తనం అర్థమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ప్రకృతిని, రాజకీయాలతో ముడిపెట్టడం వారి అవివేకమేనని అన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా వర్షాలు పడకపోతే కరువు వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరువు తీసుకొచ్చింది అనడం సబబు కాదన్నారు. ఎక్కడా తాగునీరు సమస్య రాకుండా ముందస్తుగా చర్యలను తీసుకుంటున్నామన్నారు.

టవర్ ఎక్కి యువకుల నిరసన

అనాథాశ్రమం ఏర్పాటు చేయాలని డిమాండ్



బెజ్జంకిలో టవర్‌పై యువకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలో అనాథాశ్రమం ఏర్పాటు చేయాలని ముగ్గురు యువకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. గన్నేరువరం మండలం చీమల కుంట పల్లెకు చెందిన బామండ్ల రాజు, జంగపల్లికి చెందిన కొంకటి వేణు, మాంకాలి ప్రశాంత్‌లు కొంత కాలంగా అనాథలైన వృద్ధులకు భోజనాలు అందజేస్తున్నారు. అయితే వృద్ధుల కోసం అనాథశరణాలయం కావాలని డిమాండ్ చేస్తూ బెజ్జంకిలో సెల్ టవర్ ఎక్కారు. రెండు గంటల పాటు టవర్‌పైనే బైఠాయించారు. స్థానిక ఎంపీడీఓ లక్ష్మప్ప, పోలీసులు చొరవ చూపి కిందకు దిగి వచ్చి వినతి పత్రం ఇవ్వాలని సూచించారు. మీ లక్ష్యం మంచిదేకాని చేసే విధానం ఇది కాదని తెలపడంతో వారు దిగివచ్చారు. తాము అనాథలుగా పెరిగామని అలాంటి వారి బాధలు తమకు తెలుసని వారు అన్నారు. అందుకే తాము అనాథాశ్రమం కోసం టవర్ ఎక్కినట్లు తెలిపారు.

అనభేరి పోరాటం స్ఫూర్తిదాయకం



అనభేరి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: అనభేరి ప్రభాకర్‌రావు సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకమని మంత్రి పొన్నం అన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని హుస్నాబాద్‌లోని అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో అనభేరి ప్రభాకర్ రావు, సర్వాయి పాపన్న వంటి అనేక మంది యోధులున్నారని తెలిపారు. వారి గౌరవాన్ని కాపాడే విధంగా, వారి జ్ఞాపకాలను భవిష్యత్ తరానికి అందించేందుకు కృషి చేస్తామన్నారు.

నిత్య జీవితంలో సైన్స్ భాగం కావాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



మాట్లాడుతున్న గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: విద్యార్థులు నిత్య జీవితంలో సైన్స్‌ను ఒక భాగంగా మార్చుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ విద్యార్థులకు సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించగా ఇర్కోడ్ పాఠశాల విద్యార్థులు అశ్విన్, ఉదయ్, సూర్యతేజ రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరిచారు. వారికి గురువారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించగా, ముఖ్య అతిథిగా అదనపు గరిమా అగర్వాల్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి ప్రశ్నించడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచడానికి కృషి చేయాలని సూచించారు.

పీఎస్‌కు వచ్చేవారిని గౌరవించడం బాధ్యత

సిద్దిపేటకమాన్: పీఎస్‌కు వచ్చే మహిళలను గౌరవించాలని స్వార్డ్ స్వచ్ఛం సంస్థ సీఈఓ శివకుమారి అన్నారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ సంయుక్త సహకారంతో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం జెండర్ సెన్సిటైజేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలతో ఎలా ప్రవర్తించాలి, జెండర్‌పై సలహాలు, సందేహాలు, చట్టప్రకారం నడుచుకోవాల్సిన పద్ధతులు వివరించారు.

తలంబ్రాల దీక్షలో భాగస్వామ్యం అభినందనీయం



గోటి తలంబ్రాలను పంపిణీ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: పట్టణానికి చెందిన రామకోటి రామరాజు భద్రాచలం ఆలయం చేపట్టిన కోటి తలంబ్రాల దీక్షలో భాగస్వాములు కావడం అభినందనీయమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లోని కృష్ణాలయంలో భద్రాచలం నుంచి వచ్చిన గోటి తలంబ్రాల ప్యాకెట్లను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గోటితో తలంబ్రాలను వొలిచి తిరిగి భద్రాచలం ఆలయానికి అందజేసే అవకాశం రామరాజు దక్కడం హర్షణీయమన్నారు. ఆలయం నుంచి 150 కిలోల వడ్లను ఇచ్చారని అన్నారురు. గోటి తలంబ్రాలను తీసుకొని వొలిచి తిరిగి ఆలయానికి పంపించే అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కృష్ణాలయం అధ్యక్షులు రామచంద్రం, ప్రతినిధులు వెంకటేశ, అత్తెల్లి లక్ష్మయ్య, చంద్రశేఖర్, సంగునూరి సత్యనారాయణ, గుంటుకు రాజు పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నారు

- సీఏఏ చట్టాన్ని రద్దు చేయాల్సిందే
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



అనభేరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ నాయకులు

హుస్నాబాద్: సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు 76వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడే కమ్యూనిస్టులు లేని పోరాటాలు ఊహించలేమన్నారు. దొరలు, భూస్వాములకు చెందిన 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన చరిత్ర పోరాట యోధులదని అన్నారు. కమ్యూనిస్టులు బలోపేతం అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసమే సీఏఏ చట్టాన్ని తీసుకువచ్చారని, దీనిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశాడు. సాయుధ పోరాట యోధుల చిహ్నంగా హైదరాబాద్‌లో వంద ఎకరాల్లో స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే యోధుల విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే యోధుల చరిత్రను భావితరాలకు అందించే విధంగా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, ప్రభాకర్ రావు కూతురు విప్లవ కుమారి, నాయకులు పాల్గొన్నారు.

మా గూడును చెదరగొట్టవద్దు

- రహదారి విస్తరణను కుదించండి
- పనులను అడ్డుకున్న ప్రజలు, దుకాణాదారులు



హుస్నాబాద్‌లో ఆందోళనకు దిగిన దుకాణాదారులు

హుస్నాబాద్: రహదారి విస్తరణలో భాగంగా మా గూడును చెదరగొట్టి నష్టాన్ని కలిగించవద్దని హుస్నాబాద్ పట్టణ ప్రజలు, దుకాణాదారులు ఆందోళనకు దిగారు. రోడ్డు విస్తరణ పనులను ఆపాలని ఈటాచీ యంత్రాన్ని గురువారం అడ్డుకున్నారు. దుకాణాలు బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుకాణాదారులు మాట్లాడుతూ బుధవారం పట్టణంలో 100 ఫీట్లలో 10 ఫీట్లు తగ్గించి విస్తరణ చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతి రెడ్డికి మొరపెట్టుకున్నామన్నారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అయినా అధికారులు ఇళ్లను కూల్చేందుకు వచ్చారన్నారు. ప్రధాన రహదారిలోని అన్ని దుకాణాల ఎదుట బోర్లు వేసుకున్నామని, ఈ విస్తరణతో బోర్లతో పాటు ఇళ్లను సైతం కోల్పోయే అవకాశం ఉందన్నారు. 50 ఏళ్ల కింద కట్టుకున్న ఇళ్లను కూల్చివేయాలనుకోవడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనులకు తాము వ్యతిరేకం కాదని, మా ఇళ్లకు నష్టం కలగకుండా విస్తరణ పనులు చేపట్టాలని వారు కోరారు.

క్లుప్తంగా

రాజన్న హుండీ ఆదాయం రూ.12.90లక్షలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి అలయ మహాశి వరాత్రి జాతర ముగియడంతో గురువారం హుండీ లెక్కించారు. బుకింగ్ ద్వారా రూ.3,14,275లు, డిజిటల్ హుండీ రూ.33,702లు, హుండీలు రూ.9,42,645లు మొత్తం రూ.12,90,622లు వచ్చినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ పరిశీలకులు రంగారావు, అలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల మేత కోసం వెళ్లి.. కానరాని లోకాలకు..

- విద్యుదాఘాతానికి రైతు మృతి
- ఖాజాపూర్‌లో ఘటన



జైపాల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంతర్‌గాం జైపాల్(30) గేదెల కోసం పచ్చి మేత తెచ్చేందుకు వెళ్లాడు. పొలాల మధ్య వెళ్తుండగా ఒక రైతు మొక్కజొన్న పంట రక్షణ కోసం చుట్టూ కరెంట్ తీగలు పెట్టిన విషయాన్ని గమనించ లేదు. దీంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ పొలం రైతు శ్రీనుది. అతను హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని దీంతో తన భర్త చనిపోయాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిర్గాపూర్ పోలీసులు తెలిపారు.

మద్యంమత్తులో కింద పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: మద్యంమత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం... ఇస్నాపూర్ మల్లికార్జున్ నగర్ కాలనీలో ఉంటున్న నాగేంద్ర కుమార్(36) బొల్లారం పరిధిలోని ప్రైవేట్ కంపెనీలో క్వాలిటీ మేనేజర్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన స్నేహితుడైన నవీన్ కుమార్ ఇంటి ముందు నుంచి వెళ్తుంటే ఆపి అతనితో చికెన్ తెప్పించాడు. అనంతరం ఇంట్లో ఒంటరిగా ఉన్న నాగేంద్ర కుమార్ మద్యం తాగి వాష్ బేసిన్ వద్దకు వెళ్లి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం ఉదయం ఉద్యోగులు ఇతనికి ఫోన్‌కు ఎన్నిసార్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదు. చేసేది లేక ఇంటి వద్దకు వచ్చి ఉద్యోగులు, స్థానికులు తలుపులు కొట్టినా తీయడం లేదు. దీంతో అనుమానం వచ్చిన వారు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



యాదగిరి

హవేళిఘణాపూర్(మెదక్): భర్త అదృశ్యమయ్యాడని భార్య పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటన హవేలిఘణాపూర్ స్టేషన్‌పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఔరంగాబాద్‌కు చెందిన రాధమొల్ల యాదగిరి, ఎల్లమ్మ భార్యాభర్తలు. అతను మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8న పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాలేదు. తెలిసిన వారి ని, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం భార్య.. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో ఉంది.

బ్రేక్ ఫాస్ట్

- వంట కార్మికులకు నాలుగు నెలలుగా ఆగిన బిల్లులు
- అప్పులు చేసి మరి వంట
- దిక్కుతోచని పరిస్థితిలో చేతులెత్తేసిన వైనం
- మధ్యాహ్న భోజన బాధ్యతలు కూడా వీరికే..
- పెరిగిన పని భారం ఓ కారణం?



అల్పాహారం తింటున్న విద్యార్థులు(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): అల్పాహారం పథకానికి బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం అల్పాహారం పథకాన్ని ప్రారంభించింది. అక్టోబర్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేసింది. జిల్లాలో 926 ప్రభుత్వ పాఠశాలుండగా దశల వారీగా 124 పాఠశాలల్లో అమలులోకి తెచ్చారు. కానీ అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టు కింద అల్పాహారం పథకాన్ని ప్రారంభించారు. ఈ పాఠశాలలో మొత్తం 136 మంది విద్యార్థులు ఉన్నారు. వంట కార్మికులు మూడు నెలలపాటు సవ్యంగా నడిపారు. బిల్లులు రాకపోవడంతో జిల్లాలోని చాలా పాఠశాలల్లో తమ వల్ల కాదని చేతులెత్తేశారు. అలాగే మండలంలోని తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాల, హరిజనవాడ పాఠశాల, బీజీ వెంకటాపూర్ పాఠశాలలో కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. అయితే వారంలో రోజుకో తీరుగా విద్యార్థులకు అల్పాహారం అందించాలి. కానీ ఎక్కువగా శాతం ఉప్మా, ఉగ్గాణి, అటుకులు, ఎప్పుడో ఒకసారి మిల్లెట్‌ను వండి వార్చుతున్నారు. ఇడ్లీ, పూరీ మాత్రం అందని ద్రాక్షగానే మారిందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకే అల్పాహారం బాధ్యతలు అప్పగించడంతో రెండు పనులతో సతమతమవుతున్నారు. ఇటు మధ్యాహ్నం, అటు అల్పాహారం వంటలు చేయడం వారికి మరింత భారంగా మారింది. వీటికి తోడు సమయానికి బిల్లులు చేయడం లేదని పోతున్నారు. నాలుగు నెలల బిల్లులు రావాల్సి ఉందని వంట కార్మికులు వాపోయారు. బిల్లులు రాక అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల మెను ఇలా..

సోమవారం: ఇడ్లీ, సాంబారు లేదా గోధుమ రవ్వ, ఉప్మా చట్నీ.
మంగళవారం: పూరీ, ఆలుకుర్మా లేదా టమోటా బాత్, సాంబారు
బుధవారం: ఉప్మా, సాంబారు లేదా రైస్‌రవ్వ కిచిడీ, చట్నీ
గురువారం: మిల్లెట్ ఇడ్లీ, సాంబారు లేదా పొంగల్, సాంబారు
శుక్రవారం: ఉగ్గాణి, అటుకులు, మిల్లెట్ ఇడ్లీ, చట్నీ లేదా గోధుమ రవ్వ కిచిడీ, చట్నీ
శనివారం: పొంగల్ సాంబారు లేదా వెజిటబుల్ పులావ్ రైతా

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి



అల్పాహారం పథకం ప్రారంభం నుంచి పాఠశాలలో విద్యార్థులకు వంటలు వడ్డి వారుస్తున్నాను. మూడు నెలల వరకు బిల్లులు రాకపోవడంతో వండటం ఆపేశాను. ఇప్పటికే రెండు నెలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు రావాల్సి ఉంది. అప్పులు చేసి వంటలు చేస్తున్నాను. పెండింగ్ బిల్లులు వెంటనే అందజేయాలి.

– నాగరాజు, వంట కార్మికుడు, తిమ్మాపూర్

బిల్లులు రాకపోవడం వాస్తవమే

ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారానికి సంబంధించిన బిల్లులు రాకపోవడం వాస్తవమే. నాలుగు నెలలకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులను కోరాం. ఇవి రాగానే వంట కార్మికుల ఖాతాలో జమ చేస్తాం. కొన్ని పాఠశాలల్లో ఈ పథకం ఆగినట్లు మా దృష్టికి వచ్చింది.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ

కాలువల నిర్మాణాలు పూర్తి చేయండి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మల్లన్న సాగర్ కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: మల్లన్నసాగర్ కాలువల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి పంటలకు నీరివ్వాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం దుబ్బాకలో మల్లన్నసాగర్ కాలువల నిర్మాణం తీరుతెన్నులపై ఇరిగేషన్ ఎస్ఈ బస్వరాజు, ఈఈ వేణుబాబు, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలో మల్లన్నసాగర్ ద్వారా చెరువులు, కుంటలు, పంటలకు నీరందించే కాలువల నిర్మాణం ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయి? అవి ఎందుకు మధ్యలో నిలిచిపోయాయి? అనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటిని పూర్తి చేసి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నీరు వస్తుందన్న ఆశతో రైతులు పంటలు వేసుకున్నారన్నారు. పనులు నత్తనడకన సాగుతుండటంతో ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాక–మల్లాయపల్లి మధ్యలో నిలిచిపోయిన కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. చెరువులకు నీరు వదిలి పంటలు కాపాడాలన్నారు.

కాలువల నిర్మాణ పనులు పరిశీలన

దుబ్బాకతో పాటు మల్లాయపల్లి, కమ్మరపల్లి తదితర ప్రాంతాల్లోనూ మల్లన్నసాగర్ కాలువ నిర్మాణ పనులను రైతులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నీళ్లు లేక తమ పంటలు ఎండిపోతున్నాయని మల్లాయపల్లి, కమ్మరపల్లిలకు చెందిన రైతులు విన్నవించారు. కాలువ పనులు పూర్తి చేయించి నీరిచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో చీకోడ్ ఎంపీటీసీ రాంరెడ్డి, మల్లాయపల్లి సర్పంచ్ వేముల మల్లేశంగౌడ్, పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులున్నారు.

మాటల్లో దింపి.. గొలుసు తెంపుకెళ్లాడు



సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుడు

దుబ్బాకరూరల్: మహిళ మెడలోంచి బంగారు గొలుసు తెంపుకెళ్లిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎనగుర్తిలో జరిగింది. ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోయడ యాదమ్మ గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద కల్లు అమ్ముకుంటుంది. గురువారం సాయంత్రం 4.30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి కంపౌండ్‌లో కల్లు తాగాడు. ఆమెను మాటల్లోకి దింపి పుస్తెల తాడును తెంపుకుని చిట్టాపూర్ వైపు బైక్‌పై పారిపోయాడు. సుమారు రెండున్నర తులాలు, రూ.50వేలు విలువ ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

417 గ్రాముల మత్తుపదార్థం స్వాధీనం

సిద్దిపేటరూరల్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పట్టుకున్నామని సీఐ శ్రీను గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నిందితులు కొంతకాలంగా విశాఖ నుంచి అక్రమంగా గంజాయిని కొనుగోలు చేసుకొని వచ్చి కొంత వారు సేవించి మిగతాది ఎక్కువ ధరకు అమ్ముతుంటారు. ఇదే క్రమంలో నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో విక్రయాలు జరుపుతున్నారనే సమాచారం వచ్చింది. ఆ మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి యండ్ల అరవింద్, గట్టు విసీల్, ఇఫ్తాకర్, మహమ్మద్ రఫిక్, మరో మైనర్‌ను పట్టుకున్నారు. వారి నుంచి 417 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ కు పంపారు. జల్సాలకు అలవాటుపడి వారు చేసే పనిలో వచ్చే డబ్బులు సరిపోక గంజాయి వ్యాపారం చేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని, ఈ నేరానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు. గంజాయి విక్రయాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100కు గానీ సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712667100 నంబర్‌లో సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అపూర్వరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పెళ్లికెళ్లి వచ్చేలోపు ఇల్లు గుల్ల

15 గ్రాముల బంగారం, 25 తులాల వెండి, రూ.12 వేల నగదు చోరీ

పటాన్‌చెరు టౌన్: బంధువుల పెళ్లికి వెళ్లి వచ్చేలోపే ఇంట్లో దొంగలు పడి సొత్తు చోరీ చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం ముత్తంగిలో నర్సింహులు కుటుంబం నివాసముంటోంది. అతను కుటుంబీకులతో కలిసి మంగళవారం వట్‌పల్లిలో నివాసముంటున్న బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూస్తే వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉంది అందులో దాచిన 15 గ్రాముల బంగారం, 25 తులాల వెండి, రూ. 12 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కింద పడి వ్యక్తి..



దశరథ(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఓ వ్యక్తి కింద పడి మృతిచెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం కంచన్‌పల్లిలో జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన నీలబోయిన దశరథ (38) మూడేళ్లుగా పల్లెప్రకృతి వనం నర్సరీలో మొక్కలు పెంచే పని చేస్తున్నాడు. గురువారం ఉదయం నర్సరీకి వెళ్తున్నానని భార్య యశోదతో చెప్పి వెళ్లాడు. ఇక్కడ వచ్చిన కొద్దిసేపటికే కింద పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు అతడిని 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడీమిక్స్ ట్యాంకర్ ఢీకొని..

పటాన్‌చెరు టౌన్: రెడీమిక్స్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వరంగల్ ఖాజీపేటకు చెందిన రాజు(46) బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి పదేళ్ల క్రితం పటాన్‌చెరు మండలం ఘణపూర్‌కు వచ్చి స్థిరపడ్డాడు. వెల్డర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పాటీ గ్రామం నుంచి ఘణపూర్ వైపు బైక్ పై వెళ్తున్నాడు. గ్రామ శివారులోని మల్లన్న దేవస్థానం సమీపంలోకి రాగానే.. వెలమెల వైపు నుంచి పాటీ వైపు వస్తున్న రెడీమిక్స్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

నీట మునిగిన వ్యక్తి..

పాపన్నపేట(మెదక్): ఓ వ్యక్తి నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గాజులగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ కథనం మేరకు... సంగారెడ్డి జిల్లా చౌటకూర్ గ్రామానికి చెందిన దాసరి శివశంకర్ (29) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 6న ఒక పని నిమిత్తం భార్య భాగ్యతో కలిసి అత్తగారి ఊరైన గాజుల గూడెంకు వచ్చాడు. కాగా గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామంలో ఉన్న కుంట వద్దకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాక పోయే సరికి కుటుంబీకులు ఇక్కడి వెళ్లి చూస్తే చెప్పులు కనిపించాయి. కుంటలో వెతుకగా మృతదేహం లభ్యమైంది.

ఇద్దరి అరెస్టు

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి శివారులోని హెట్రో (హానర్ ఇన్ ఫ్రాఎస్టేట్స్ లిమిటెడ్ హైదరాబాద్) వారికి చెందిన భూమిలో మావోయిస్టుల పేరుతో బ్యానర్ కట్టిన ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాసాన్‌పల్లి మదిర ఇందిరా నగర్‌కు చెందిన బోనాల రాజు అలియాస్ గగన్ కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఆరు ఎకరాల భూమి ఉంది. 2014లో హెట్రో కంపెనీకి 4.23 ఎకరాలను విక్రయించాడు. మిగతా దాంట్లో తల్లి వ్యవసాయం చేస్తుంది. అయితే కంపెనీ తన భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మిస్తోంది. దీంతో మిగతా భూమి కూడా కోల్పోతామని భావించి మహారాష్ట్రకు చెందిన అజయ్ మహత్‌తో కలిసి అతను ఈ బ్యానర్లు ఏర్పాటు చేశారని సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

మెదక్ మున్సిపాలిటీ: హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు, రూ.15వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన ఎల్లమ్మతో కుమారుడు వడియారం నాగయ్య కుటుంబ కలిసి ఉంటుంది. 2023 జనవరి 28న తన తల్లిని సిద్ధిరాములు కట్టెతో కొట్టి ఉరి వేసి హత్య చేశాడని, ఆమె వంటిపై ఉన్న బంగారు వస్తువులు దోచుకెళ్లాడని కేసు నమోదైంది. మెదక్ జిల్లా కోర్టులో విచారణకు వచ్చింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నిందితుడైన మేకల సిద్దిరాములుకు పై తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో బురిడీ

రూ.8.87 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ వేసి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇంద్రేశంకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి గతేడాది డిసెంబర్ 23న ట్రేడింగ్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. దీంతో లింక్ ఓపెన్ చేసి వివరాలను నమోదు చేశారు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. ఆమె నగదును ఆన్‌లైన్ లో ఇన్వెస్ట్ చేయిస్తూ వచ్చారు. పెట్టిన పెట్టుబడి, లాభాలను చూపిస్తూ వచ్చారు. మొత్తం రూ. 8 లక్షల 87 వేలు ఇన్వెస్ట్ చేశారు. తాను పెట్టిన నగదు, యాప్ లో చూపిస్తున్న లాభాలను ఇవ్వమని ఉద్యోగిని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించ లేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.31 లక్షలు కాజేసిన...

అమీన్‌పూర్.. మండల పరిధిలోని నవ్య నగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ తన టెలిగ్రామ్ కు ఫిబ్రవరి 26 న మెసేజ్ వచ్చింది. స్పందించి దఫదఫాలుగా 31 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని నిర్వాహకులను అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే..అమీన్‌పూర్ కు చెందిన ఒక ప్రభుత్వ బ్యాంక్ ఉద్యోగికి మార్చి 2న ఆన్‌లైన్ క్రెడిట్ కార్డు ఇస్తామంటూ నమ్మించి ఒక యాప్‌ని పంపించి ఇన్‌స్టాల్ చేసుకోమన్నారు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా బాధితుడు యాప్ ఇన్‌స్టాల్ చేసుకోగానే రూ.2.68 లక్షలు అకౌంట్‌లో నుంచి డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

ఆటోడ్రైవర్లకు జీవనభృతి అందించాలి

ఆటో క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు పాలసాయిరాం



నినాదాలు చేస్తున్న సొసైటీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆటో కార్మికుల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విషాదం నింపుతుందని ఆటో క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పాలసాయిరాం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే ఆటో కార్మికులకు నెలకు రూ.10వేల జీవనభృతిని అందించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 21 మంది ఈ రంగానికి చెందిన కార్మికులు బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. ఉచిత బస్సు సౌకర్యంతో ఆటోవాలాల జీవితాలు ముందుకు సాగడం లేదన్నారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ తన భర్యతో కలిసి బలవన్మరణం చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ వైఖరికి నిరసనగా 17లక్షల ఆటో డ్రైవర్‌లు నిరసన వ్యక్తం చేశారన్నారు. సిద్దిపేటలో ఆటో డ్రైవర్‌లకు ఆటో క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీని ఎమ్మెల్యే హరీశ్‌రావు సొంత నిధులతో ఏర్పాటు చేశారన్నారు. దీంతో జిల్లాలోని వారందరూ ఆర్థిక స్వావలంబన చెందుతున్నారన్నారు. ఇదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ నాయకులు మల్లేశం, ఉమర్, తిరుపతి, శ్రీనివాస్, బాలకిషన్, కరుణాకర్, మల్లేశం గౌడ్, రామరాజు, కరీమ్, పాష, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

వీడిన మిస్టరీ

- గుర్తు తెలియని వ్యక్తి హత్యలో నిందితుడికి రిమాండ్
- కూలి డబ్బుల విషయమే గొడవకి కారణం
- వెల్లడించిన సీఐ శ్రీను



సమావేశంలో నిందితుడిని చూపుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అపూర్వ రెడ్డి

సిద్దిపేటరూరల్: ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాల వద్ద గుర్తుతెలియని వ్యక్తి హత్య జరుగగా.. ఈ కేసును గురువారం రూరల్ పోలీసులు ఛేదించారు. ఎస్‌ఐ అపూర్వ రెడ్డి తో కలిసి రూరల్ సీఐ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. బండి రమేష్ కాలకుంట కాలనీలో నివాసం ఉంటాడు. అతను పది రోజుల క్రితం తిరుపతితో కలిసి కూలీ పనికి వెళ్లాడు. ఈనెల 10న కాలేజీకి సమీపంలో కొత్త ఇల్లు నిర్మాణ పనికి మేస్త్రీ శ్రీనివాస్.. రమేష్, తిరుపతి, రాజయ్యలను పనికి రమ్మన్నారు. ఇసుక మోసినందుకుగాను తిరుపతిని పిలిచి కూలీ డబ్బులు రూ.2 వేలిచ్చాడు. అతను రమేష్ , రాజయ్యలకు రూ.500 చొప్పున ఇచ్చి రూ.1000 తన దగ్గర ఉంచుకున్నాడు. మరుసటి రోజు రమేష్‌కు పని దొరక్కలేదు తిరుపతిని రూ.500 ఇవ్వమని అడిగితే బదులిచ్చాడు. తర్వాత కూరగాయలు, ఇతర వస్తువులు తీసుకొని వస్తానని చెప్పి మార్కెట్ కు తిరుపతి వెళ్లాడు. కూరగాయల వెంట మద్యం సీసాను తెచ్చుకున్నాడు. దీంతో పని ప్రాంతం వద్దనే ఉన్న గుడిసెలో వారిద్దరూ కలిసి తాగారు. మద్యమత్తులో డబ్బుల విషయం రాగా గొడవ పడ్డారు ఆవేశానికి లోనైన తిరుపతి అక్కడే ఉన్న కట్టెను తీసుకొని రమేష్ ను కొట్టాడు. కొంతసేపు తోపులాట తర్వాత అదే కట్టెను తీసుకొని తిరుపతి తలపై బలంగా కొట్టడంతో కింద పడిపోయాడు. సమీపంలో ఉన్న బురద కాలువలో పడేసి పక్కనున్న బండరాయితో తలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడిని కాలకుంట్ల కాలనీలో అదుపులోకి తీసుకున్నారు. విచారిస్తే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్ కు పంపినట్లు సీఐ శ్రీను తెలిపారు. కేసు చేదనలో సందీప్, రాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న ప్రత్యామ్నాయం



మొక్కజొన్న పంటలో క్షేత్రంలో నగేశ్ తదితరులు

రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ అధిపతి డాక్టర్ నగేష్

సిద్దిపేటరూరల్: పంట మార్పిడి చేస్తూ మొక్కజొన్న సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం హెడ్ డా.నగేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బుస్సాపూర్‌లో పరిశోధనా స్థానం ద్వారా సాగు చేస్తున్న మొక్కజొన్న డీహెచ్ ఎం182, 206, కేఎస్‌ఎం హెచ్ 4191 హైబ్రిడ్ రకాల సాగు.. క్షేత్ర ప్రదర్శన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశోధనా స్థానం మొక్కజొన్న రకాలను సాగు చేస్తే నీటి ఎద్దడిని, ఎండు తెగులును తట్టుకుంటాయన్నారు. వానాకాలం, యాసంగి సీజన్లకు అనుకూలమన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్నను సాగు చేస్తే రైతులు అధిక ఆదాయం పొందొచ్చన్నారు. మార్చి , ఏప్రిల్ నెలల్లో పడే వడగండ్ల నుంచి కూడా పంటను కాపాడుకోవచ్చన్నారు. మార్కెట్‌లో లభ్యమవుతున్న ప్రైవేట్ మొక్కజొన్న విత్తనాలకు దీటుగా వ్యవసాయ పరిశోధనా స్థానం అందిస్తున్న విత్తన రకాలు ఎంతో సమర్థవంతంగా చీడపీడలను తట్టుకుంటాయన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా మంచి దిగుబడులను అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ ఎస్ శ్రీదేవి , సీనియర్ శాస్త్రవేత్త డా. మల్లయ్య , మండల వ్యవసాయ అధికారి పర్శరాంరెడ్డి , ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్లు డా. విజయ్, శాస్త్రవేత్తలు పల్లవి, ఉమారాణి, సరిత, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రేమ్ సాయి, మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి పాల్గొన్నారు.